# గురువుకే గురుడు

సోమేశం కూర్చునే కుర్చీ పేరే 'వద్దంటే డబ్బు!' ఇక కావాలంటే డబ్బెలా వచ్చి పడుతుందో ప్రత్యేకించి చెప్పనక్కరలేదేమో!

సోమేశం పదవి ఏమిటని అడక్కండి. పదవితో నిమిత్తం లేకపోయినా, ఆ ఆఫీసులో ఏ పని అవ్వాలన్నా, ఏ ఫైలు కదలాలన్నా, సోమేశం సహాయం లేందే ఏ పరిస్థితుల్లోనూ ఆ ఫైలూ, ఆ పనీ జరగవు. అందుకు సోమేశం చుట్టూ ఎప్పుడూ జనం బెల్లం చుట్టూ చీమల్లా, ఈగల్లా తిరుగుతూ ఉంటారు. వచ్చీ రాగానే చేతులు జోడించి దణ్ణా లెడుతూ, ఎంతో నమ్రతగా సోమేశంతో మాట్లాడతారు. ఇంటి దగ్గర వాళ్ళిచ్చిన కవరు బరువుని బట్టి వారి వారి పనులు ఎంత తొందరలో చెయ్యాలనుకున్నదీ నిశ్చయించుకుని చేస్తాడు.

ఇంతలా లంచా లుచ్చుకునే సోమేశం తను లంచా లిచ్చుకుంటున్నట్లు ఎక్కడా దొరక్కుండా  చాలా తెలివిగా, జాగ్రత్తగా ప్రవర్తిస్తాడు. ఆఫీసులో ఒక్క చిల్లిగవ్వ ఇచ్చినా ముట్టడు. తెలివితక్కువగా ఎవరన్నా ఆఫీసులో లంచం ఇవ్వబోతే వారిమీద ఎగిరి పడతాడు. అంతేకాదు, వారి పని అవనట్టే!

జీతం కాకుండా అదనంగా వచ్చిపడే వేలకి వేల రూపాయలతో ఇంతవరకూ ఇంటికి ఒక్క సామానూ కొనలేదు. భార్యకి ఒక్క నగన్నా చేయించలేదు. ఆ ఊళ్ళో బాంక్‌లో కూడా నయాపైస వేసుకోలేదు. ఏనాడన్నా ఏ కిట్టనివాడో ఇంటిమీదికి ఇన్‌కంటాక్సు వాళ్ళని పంపి రెయిడ్ చేయిస్తే తన గుట్టు రట్టువుతుందన్న భయమే ఈ జాగ్రత్తకి మూలకారణం.

బంధువర్గంలో నారాయణ ఒక్కడే సోమేశానికి ఎంతో ఆత్మీయుడు. అత నొక్కడికే సోమేశం మంచీ, చెడ్డా చెప్తాడు.

నారాయణకి తన పల్లెలో యాభై ఎకరాలదాకా పంట పొలం, పెంకుటిల్లు ఉన్నాయి. సొంత వ్యవసాయం చేసుకుంటూ, సొంత పాడీ, పంటా అనుభవిస్తూ దర్జాగా బతుకుతున్నాడు. అతని ఒక్కగా నొక్క చెల్లెలు జానకి భర్తే సోమేశం.

జానకీ, సోమేశాలకి లేక లేక పుట్టిన కొడుక్కి ఆనంద్ అని పేరెట్టుకుని, అతి ముద్దుగా పెంచుకుంటున్నారు. ఆనంద్‌కి పెద్ద చదువు చెప్పించి కలెక్టర్నో కాకపోతే ఆఖరికి పెద్ద ఇంజనీర్నో చెయ్యాలని వారు కలలు కనసాగారు. అదే ధ్యేయంగా పెట్టుకుని ఆనంద్‌ని మంచి స్కూల్లో వేసి చదివించసాగారు.

"ఇంతకీ సోమేశం గడిస్తోన్న లంచాల డబ్బంతా ఏం చేస్తున్నాడు? పాతర వేస్తున్నాడా?" అని మీకు సందేహం కలగవచ్చు. నారాయణతో రహస్యంగా చర్చించి, అతని సలహా ప్రకారం పట్నంలో పెద్ద ఇంటిస్థలం కొన్నాడు. అలాగే పదెకరాల మామిడితోట, పాతి కెకరాల పంటపొలం నారాయణ పొలం పక్కనే కొన్నాడు. వాటి మంచి చెడ్డలన్నీ నారాయణే చూడసాగాడు.

తోటమీద, పొలంమీద వచ్చే రాబడి తెచ్చి నారాయణ సోమేశాని కిచ్చినప్పుడు "నారాయణా ! అదీ అక్కడే బాంకులో వెయ్యి. నా కివ్వవద్దు" అనేవాడు. అతని ఆదేశానుసారం బాంకులో అకౌంట్ తెరిచి అందులో ఆ డబ్బు వేసి, నెల నెలా బావగారికి లెక్కలు చెప్పి వెళ్ళేవాడు. ఎప్పుడన్నా బావమరిదికి వెయ్యో, రెండు వేలో సోమేశం ఇవ్వబోతే – "బావా ! కలిగుంటే ఆడపిల్లకి పెట్టాలి గానీ, ఆడపిల్ల సొమ్ము తినడమేమిటి?" అని నమ్రతగానే తిరస్కరించేవాడు. ఏటా పండగలకి జానకిని, భర్తనీ తీసుకెళ్ళి బట్టలు పెట్టి పంపేవాడు. ఆ అన్నా చెల్లెళ్ళ ఆప్యాయత చూసి సోమేశమే కాకుండా ఊరంతా ఆశ్చర్యపడేవారు. ఆ పల్లెలోని ఆడపడుచులు పుట్టిళ్ళ కొచ్చి నారాయణని ఉదాహరణగా చూపించి, అతనిలా తమ అన్నదమ్ములు పెట్టడంలేదని దెప్పిపొడిచి, మరీ వెళ్ళేవారు. దాంతో జానకికి మరింత గర్వంగా ఉండేది. పుట్టింటినుంచి రాగానే ఊళ్ళో వాళ్ళకి అన్నగారు పెట్టిన చీర, సారె చూపించి, ఇంతని అంత చేసి మరీ చెప్పేది – అంతా అసూయ పడాలన్న దృష్టితో జనం జానకి అదృష్టాన్ని కొనియాడుతూ తమ దురదృష్టాన్ని నిందించుకుంటూ బాధపడుతుంటే జానకి గర్వం రెట్టింపయ్యేది.

రిటైరవుతున్నామంటే చాలా మందిలో ఓ నిరుత్సాహం, దిగులు కలుగుతుంది. కొన్నేళ్ళపాటు "తనది" అనుకుని అంటిపెట్టుకున్న ఆఫీసుకీ, తనకీ రేపటినుంచి ఏ సంబంధ బాంధవ్యాలు లేవంటే కలిగే వేదన వర్ణనాతీతం. మధ్య తరగతి మనుగడలకైతే "మరిక జీతం నెల నెలా రాదు" అన్న నిజం మరీ ఆవేదనని కలిగిస్తుంది.

కానీ మర్నాడు రిటైరు కాబోతున్న సోమేశంలో మాత్రం ఎటువంటి ఆవేదనా లేదు. కారణం రిటైరైనా తనకి ఏ సమస్యలూ లేవు. డబ్బు కావలసిన దానికన్నా అధికమే గడించుకున్నాడు. స్థలం, తోట, పొలం కాకుండా డబ్బు కూడా లక్షలకి లక్షలు వేరే వేరే బ్యాంకుల్లో ఉన్నాయి. ఎంత లేదన్నా నెలకి వడ్డీల రాబడే కొన్ని వేల

రూపాయలకి తక్కువ ఉండదు. అన్నింటికన్నా ముఖ్యం తాము కోరుకున్నట్లు కొడుకు ఇంజనీరయ్యాడు. పైగా కంప్యూటర్ కోర్సు కూడా చేసి పై చదువులకి అమెరికా వెళ్ళి, చదువు పూర్తి కాగానే ఉద్యోగం కూడా ఇవ్వడంతో అక్కడే స్థిరపడిపోయాడు. అరచేతుల్లో స్వర్గాన్ని పెట్టుకున్న ఆ దంపతులకి ఏం లోటని? అలాంటి సోమేశం రిటైరుమెంటంటే ఎందుకు బాధపడతాడు? పైగా మనసూ, విశ్రాంతిని కోరుతోంది. ఇల్లు కట్టుకుని, అందులో ఉంటూ, పొలంలో ధాన్యం, తోటలో పళ్ళూ, ఫలాలు తింటూ శేష జీవితం హాయిగా, నిశ్చింతగా గడపాలని కలలు కనసాగాడు.

సోమేశం గురించి, అతను ఆఫీసులో చేసిన సేవల గురించి పై అధికారి, తోటి ఉద్యోగస్తులు నాలుగు మంచి మాటలు చెప్పి, పూలమాల, ప్రెజెంటేషన్‌తో సత్కరించి, తేనీటి విందుతో వీడ్కోలిచ్చారు.

తను కొన్న స్థలంలో ఓ మేడ కట్టి, ఓ వాటాలో తనుంటూ, కొంత భాగం అద్దెకిచ్చి సొంతింట్లో హాయిగా, స్వేచ్ఛగా ఉండాలన్న కోరికని నారాయణ చెవిలో వెయ్యగానే – "అదెంత పని బావా? నే నుండగా నీ కెందుకు?" అంటూ ఇంటి ప్లానేయించి, పునాదులు తీయించేశాడు మరో వారానికే.

నారాయణ సలహామేరకు పై వాళ్ళెవరికీ రిటైరవగానే లంచాల డబ్బుతో ఇల్లు కట్టినట్లు అనుమానం కలగకుండా తనకి వచ్చిన పి.ఎఫ్. అంతా పెట్టి, నారాయణ దగ్గర కూడా మిగతా డబ్బు అప్పు చేసినట్లు ఊరికే నోటు రాసిచ్చి రెండంతస్తుల మేడ ఆధునిక సదుపాయాలతో కట్టించాడు. పెద్ద ఎత్తున గృహ ప్రవేశం చేసుకోవాలని ముహూర్తం నిర్ణయించి, కొడుక్కి ముందుగా రమ్మని ఉత్తరం రాశాడు.

తొలిసారి అమెరికా నుంచి వచ్చిన కొడుకుని చూసుకుని మురిసిపోతూ, ఆనంద్‌కి కొత్తిల్లంతా చూపించి, కొడుకు సలహాలు కూడా తీసుకోసాగారు సోమేశం, జానకమ్మ.

సహాయాని కంటూ నారాయణ కుటుంబం కూడా ఇరవై రోజులు ముందుగానే వచ్చారు.

సాయంకాలం వసారాలో కూర్చుని సోమేశం, నారాయణ వారి కుటుంబాలు కబుర్లు చెప్పుకుంటున్నారు. అంతలో వచ్చాడు ఆ ఊళ్ళోనే ఉన్న నారాయణ దూరపు బంధువు, వరసకి బావమరిది అయిన పతంజలి.

"రండి బావగారూ! బహుకాల దర్శనం" అంటూ అతన్ని ఆహ్వానించాడు నారాయణ.

కొంత సేపటికి అతనూ వారి కబుర్లలో కబుర్లు కలిపి - "ఏమండీ సోమేశంగారూ! అబ్బాయి పెళ్ళెప్పుడు?" అన్నాడు ఏదో అతనితోటి మాట్లాడాలి కదా అన్నట్లు.

"చూడాలండీ! చాలా సంబంధాలు వస్తున్నాయి. మొన్ననే కదా వాడూ వచ్చాడు.

గృహప్రవేశం అయ్యాక, పిల్లాడికి నచ్చిన పిల్లని చూసి పెళ్ళి కూడా చేసి పంపాలనే మా ఉద్దేశం కూడా!' అన్నాడు సోమేశం.

"అదేమిటి? ఉయ్యాల్లో పిల్ల పెట్టుకుని ఊరంతా వెతికినట్టు - ఇంట్లో మేనకోడలుండగా పై సంబంధా లేమిటి బావా?" అన్నాడు నారాయణ కొన్నేళ్ళుగా కడుపులో దాచుకున్న విషయాన్నిక దాచుకోలేక.

ఏమాత్రం ఊహించని నారాయణ మాటలకి సోమేశం ముఖం వివర్ణమైపోయింది.

అది విని అక్కడే కూర్చున్న ఆనంద్ లేచి పనున్నట్లు బయటి కెళ్ళిపోయాడు.

జానకమ్మ కూడా - "కంచా లెడతాను. భోజనానికి లేవం"డంటూ లోపలి కెళ్ళిపోయింది.

కంచాల ముందు కూర్చున్న బావామరుదులు ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా, నిశ్శబ్దంగా భోజనాలు చేస్తున్నారు. ఎవరి ఆలోచనలు వారిని తొలుస్తున్నాయి. ఇంతకాలం మనసులు ఒకటై,ఆప్యాయతలతో, అనుబంధాలతో పెనవేసుకున్న ఆ రెండు కుటుంబాల మధ్య ఈ పెళ్ళి ప్రసక్తి అపశ్రుతినే పలికించింది. ఎన్నడూ లేని గాంభీర్యం ఆ ఇద్దరిలో చోటు చేసుకుంది.

నారాయణకి ముగ్గురు కొడుకులు, ఒక కూతురు. దురదృష్టవశాత్తూ కూతురికి చిన్నతనంలోనే మశూచి వచ్చి అందవికారంగా తయారవడమే కాకుండా, బ్రహ్మచెవుడు కూడా వచ్చింది. దానికి తోడు ఆ పిల్లకి చదువు కూడా అబ్బలేదు. అలాంటి పిల్లని బంగారం లాంటి తన కొడుక్కి చేసుకోమంటాడని సోమేశం భార్య కూడా ఎన్నడూ ఊహించలేదు. ఆ పిల్లని చూసి జాలిపడి "పాపం! నారాయణకి ఆ పిల్ల సమస్యే!" అని బాధపడేవారు. అలాంటిది ఈ రోజు ఆ పిల్లని తమ కొడుక్కే చేసుకోమనడం మిన్ను విరిగి మీద పడ్డట్టయింది వారికి. పైగా తన కూతుర్ని చేసుకోమని కాస్త నమ్రతగానైనా అడగకుండా"పై సంబంధాలేమి" టని ధీమాగా అడగటం మరీ చికాకు కలిగించింది.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ నారాయణ భార్య "అన్నగారూ! గృహప్రవేశం కాగానే ముహూర్తాలు పెట్టించి గౌరిని మీ ఇంటి కోడలుగా చేసుకోండి. పిల్లాడు కూడా

ఇక్కడే ఉన్నాడు. మీరు ఊ అనగానే ఏర్పాటు చేయిస్తాం" అంటూ భర్తవైపు చూడగానే, నారాయణ అందుకుని "అవును బావా! ఎన్నాళ్ళగానో చెప్పా లనుకుంటున్నాం. గౌరికి చెముడన్నమాట తప్ప వేరే ఏలోటూ లేదు. అదీ అమెరికాలో ఏ డాక్టరుకో చూపిస్తే బాగుచేస్తాడు. గౌరి ఎంతో బుద్ధిమంతురాలు. పనిమంతురాలు. ఇంటెడు చాకిరీ 'ఊ... ఆ' అనకుండా చేస్తుంది. గౌరి మీ ఇంటి కోడలైతే మా చెల్లెలు కుర్చీమీంచి కాలు దింపక్కరలేదు" అన్నాడు.

రాని నవ్వు ముఖానికి పులుముకుని "మేము సరే అనగానే అవుతుందా? ఆనంద్‌తో మాట్లాడాలి కదా?" అన్నాడు, అప్పటికి ఆ సంభాషణ ఆపాలన్న ఉద్దేశంతో.

"సరే - త్వరగా ఆ మాట లేవో కానివ్వండి. వాడిక ఉండేది కొద్దిరోజులే కదా? వెళ్ళేలోపల మూడు ముళ్ళూ వేయించి పంపడం ఉభయులకీ మంచిది" అంటూ లేచాడు నారాయణ.

తల్లిదండ్రులు గౌరి గురించి తీసుకొచ్చిన ప్రస్తావన విని మౌనంగా ఊరుకున్న ఆనంద్, మరి కొంచెం సేపటికి చావు కబురు చల్లగా చెప్పినట్లు అసలు విషయం బయటపెట్టాడు. తాను అమెరికన్ అమ్మాయిని రెండేళ్ళ క్రితమే పెళ్ళి చేసుకున్నాననీ, ఒక కూతురు కూడా పుట్టిందనీ.

తమ అయిష్టాన్ని బయటకి కనబరచకుండా కొడుకు చేత వద్దనిపించా లనుకున్న సోమేశం దంపతుల కీ వార్త బెబ్బమీద దెబ్బే అయింది.

నారాయణ కీ విషయం ఎలా చెప్పాలో అర్థం కాని సోమేశం, జానకమ్మ సాయంకాలం నెమ్మదిగా నారాయణ భార్యకి చెప్పి గోలపెట్టారు.

విషయం విన్న నారాయణ నిప్పు తొక్కిన కోతిలా ఎగరసాగాడు. అంతా అబద్ధమనీ, బావా, చెల్లెలూ ఆడుతున్న నాటకమనీ ఎగిరిపడ్డాడు. అనరాని మాటలు అన్నాడు. నోటి కొచ్చిన తిట్టల్లా తిట్టాడు. అంతవరకు అన్నాచెల్లెళ్ళ అనుబంధాన్ని ముచ్చటగా చర్చించుకునే ఇరుగు పొరుగులకి సోమేశం ఇంట అల్లరి, కేకలు ఏమిటో అర్థం కాలేదు. అసలు విషయం తెలీక అంతా వీథిలో కొచ్చి చూడసాగారు.

"మీకూ, మాకూ ఈ రోజుతో ఏ సంబంధం లే" దంటూ క్షణాల్లో మూటా ముల్లె సర్దుకుని నారాయణ, భార్యాపిల్లలతో రాత్రికి రాత్రే బయలుదేరి వెళ్ళిపోతుంటే, జానకమ్మ కంట నీరెడుతూ - "గృహప్రవేశం అయ్యాక వెళ్ళరా అన్నయ్యా!" అని ప్రాధేయపడుతుండగా, "ఈ గృహప్రవేశం ఎలా జరుగుతుందో చూస్తా" నంటూ బండెక్కాడు నారాయణ.

అంతవరకూ నవ్వులు, హాస్యాలతో కలకల లాడిన ఆ ఇంటిని ఒక్కసారిగా భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది. ఇంతకాలం ఏ చీకూ చింతా లేకుండా

నిర్విచారంగా ఉన్న సోమేశం దంపతుల కీనాటి సంఘటన ఏదో ప్రమాదం జరగనున్నట్లు, అపశకునంలాగే అనిపించింది. ఒకే ఇంట్లో పుట్టి, పెరిగిన అనుబంధాన్ని క్షణాల్లో తెంచుకుని వెళ్ళిపోయిన అన్నగార్ని తలుచుకుని ఓ పక్క మరో పక్క ఒక్కగా నొక్క కొడుకు పెళ్ళి తమ చేతులమీదుగా చేయలేదు సరికదా, కనీసం చూసుకోనన్నాలేదే – అన్న బాధ, చేసుకున్న పిల్లయినా మనదేశం, మన భాష కానిది. మనలో కలిసిపోతుందా? అన్న బెంగతో జానకమ్మ మాటి మాటికీ కంట నీరెట్టుకుంటుంటే, సోమేశం మనసులో ఉన్న అదే వేదనని బయటికి కనబరచకుండా లేని గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకుని తిరగసాగాడు.

మామిడాకుల తోరణాలు కట్టించి, గడపలకి పసుపులు రాయించాలని వెళ్ళిన సోమేశానికి తన కొత్తిల్లు తాళం వేసి ఉండడం ఆశ్చర్యాన్ని కలిగించింది. తాళాలు ఎవ రేశారో తెలీక గాబరాపడుతూ పొరుగువారిని అడగ్గా – "మీ బావమరిదిగా రొచ్చి వేశారండి!" అని చెప్పగానే అక్కడినుంచే బస్సెక్కి పొరుగూర్లో ఉన్న బావమరిదింటికి వెళ్ళి తాళా లిమ్మని అడిగాడు సోమేశం.

"తాళాలా? ఏం తాళాలు? ఎవ రింటివి?" అన్నాడు వెటకారంగా నారాయణ.

"నా ఇంటికి నువ్వు వేసిన కొత్త తాళంచెవులు నారాయణా! ఎల్లుండి గృహప్రవేశం కదా? పన్లు చేయించాలి!" అన్నాడు వస్తున్న కోపాన్ని అణచిపెట్టుకుంటూ.

"ఏమిటీ? నీ ఇల్లా? ఎవడయ్యా అన్నది అది నీ ఇల్లని? ఆ స్థలం నాది, అందులో కట్టిన ఇల్లు నాది తెలుసా? సోమేశం! ఆ ఇల్లే కాదు. ఆ పొలం, తోటా కూడా నావే. అందులో అడుగెట్టే అధికారం నీకు లేదు తెలుసా? అడుగు పెట్టావో కాళ్ళు విరిపించేస్తాను. నాకు ఊళ్ళో ఉన్న పలుకుబడి నీకు బాగా తెలుసు. నాకు లోకల్ సపోర్టు ఉంది. ఈ ఊళ్ళో నీ మాట వినే నాథుడెవడూ లేదు. మర్యాదగా బయటి కెళ్ళు. లేదంటే బయటికి గెంటించాల్సి వస్తుంది. నీ కొడుక్కి నా కూతుర్ని చేసుకుంటే నువ్వు లంచాలు పట్టి, నా పేర కొని దాచుకున్న ఆస్తి అంతా అల్లుడి పేర, పిల్ల పేర రాద్దా మనుకున్నాను. ఇప్పు డా ఆశ లేదుగా? ఎవడు నా కూతుర్ని చేసుకుంటే వాడికే ఆ పొలం, తోట, ఇల్లు, డబ్బూను తెలిసిందా? వీటి దస్తావేజులన్నీ నా పేర్నే ఉన్నాయని తెలుసుగా! వెళ్ళు. నీ దిక్కున్న చోట చెప్పుకో. ఏ కోర్టు కెళ్తావో వెళ్ళు! చూడు. దీంతో అవలేదు. త్వరలో లాయరు నోటీ సిప్పించి, ఇల్లు కట్టడానికి నీకు అప్పిచ్చినట్లు రాయించుకున్న ప్రోనోటులో ఉన్న డబ్బు కూడా వసూలు చేసి, నిన్ను రోడ్డుమీదికి ఈడ్పిస్తా!" అంటూ పెడుతున్న కేకలకి శిలలా నిలబడిపోయాడు సోమేశం.

"ఎంత దగా! ఎంత మోసం! ఎన్నడూ ఒక్క పైస తనది ముట్టని బావమరిదిని పూర్తిగా నమ్మేసి లంచాలు పట్టి గడించిన సొమ్ముతో కొన్న ఆస్తంతా అతని పేర పెట్టాను. డబ్బంతా కూడా అతని పేరే బ్యాంకుల్లోవేసి, ఇన్‌కంటాక్సు వాళ్ళ కళ్ళు కప్పానని ఆనందపడ్డాను. ఇంత కుటిలత్వం కడుపులో దాచుకుని, ఎంత పకడ్బందీగా నాటకం ఆడాడు దుర్మార్గుడు! ఇన్నేళ్ళూ నన్ను నమ్మించి ఒక్కసారి అగాధంలోకి తోస్తాడా? నమ్మక ద్రోహి! నీచుడు! నన్ను ఈనాడు పైసా లేని బికారిని చేస్తాడా? భగవాన్! ఇప్పుడు నా గతేమిటి? ఎలా బతకాలి? పాపిష్ఠి డబ్బు ఇలాగే మోసగిస్తుందా?" అన్న ఆలోచనలు జోరీగల్లా ముసురుతుంటే ఏం చెయ్యాలో తోచక, ఏం చెయ్యలేక దిక్కులు చూస్తున్న సోమేశాన్ని బయటి కెళ్ళమని నారాయణ మళ్ళీ హెచ్చరించడంతో, నోరు పడిపోయిన వాడిలా, జీవచ్ఛవంలా బయటి కొచ్చి ఇంటిముఖం పడ్డాడు.

"కారణాంతరాలవల్ల గృహప్రవేశం ప్రస్తుతానికి ఆపుచేశా" మంటూ అప్పటికప్పుడు అందరికీ కబుర్లు పంపిస్తున్న సోమేశాన్ని జానకమ్మ కారణం అడిగి, విషయం తెలుసుకుని మొదలు నరికిన మానులా కూలబడిపోయింది.

పిల్ల ఆరోగ్యం బాగాలేదని వచ్చిన కేబుల్ అందుకొని విషయం తెలిసినా, తల్లిదండ్రుల్ని పట్టించుకోకుండా అప్పటికప్పుడే ప్రయాణమై వెళ్ళిపోతున్న ఆనంద్‌ని బేలగా చూశా రా దంపతులు ఏం చెయ్యలేక.

తెల్లారి లేచిన సోమేశం ఒంటినున్న గుడ్డలు చింపుకుని జుట్టు పీక్కుంటూ పిచ్చి కేకలు పెడుతూ రోడ్లంట పరుగెత్తనారంభించాడు. భర్త దీనస్థితి చూసి గుండె బద్దలయ్యేలా ఏడ్చిన జానకమ్మ గుండె నిజంగానే ఆగిపోయిం దా రాత్రి.

"బాబూ! లంచా లుచ్చుకోకండీ! పాపిష్ఠి డబ్బు అచ్చిరాదు బాబూ! న్యాయమైన సొమ్ము సుఖాన్నిచ్చినట్లు, అన్యాయమైన సొమ్ము సుఖపెట్టదు నాయనా! నన్ను చూసి, తెలుసుకోండి. నాలా మీరు నాశనం అయిపోకండి! లక్షలు గడించిన బికారిని – నిజం బాబూ!" అంటూ తెలివొచ్చినప్పుడు తను ఉద్యోగం చేసిన ఆఫీసు గేటు దగ్గర కేకలు పెడుతూ తిరిగే సోమేశాన్ని చూసి నిట్టూరుస్తూ – "కొడుకు చేసిన పనికి పాపం! సోమేశానికి పిచ్చెక్కింది" అనుకున్నారు అసలు కారణం తెలీని బంధు మిత్రులంతా.

ఆంధ్రప్రభ వార పత్రిక

**17 అక్టోబరు 1990**